


## నీటి సరఫరాలో అంతరాయం

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : జలమండలి ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ డివిజన్ 8, 15 పరిధిలోని లింగంపల్లి, పటాన్‌చెరు, ఈఎస్ఐ కమాన్ తదితర ప్రాంతాల్లో ఉన్న 900 ఎంఎం డయా పీఎస్సీ పైపులైన్‌కు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు శనివారం ఉదయం 6 గంటల వరకు జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఓ అండ్ ఎం డివిజన్ నం 8, 15 పరిధిలోని పటాన్‌చెరు, ఆర్సీపురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, హఫీజ్‌పేట్, డోమెన్స్ కాలనీ, ఎస్బీఐ ట్రైనింగ్ సెంటర్, బీహెచ్ఈఎల్ ఫ్యాక్టరీ, టౌన్‌షిప్, హెచ్‌సీయూ, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.


# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 7 జూన్ 2024 | HYDERABAD



గురువారం కేబీఆర్ పార్కులో పర్యటిస్తున్న అదనపు కమిషనర్ సునంద తదితరులు


గురువారం రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగి ఎక్కడికక్కడే నిలిచిపోయిన వాహనాలు


# ట్రాఫిక్ తిప్పలు పట్టించుకోరా?

### చినుకుపడితే.. జంక్షన్లు జామ్

### మేల్కోని అధికార యంత్రాంగం

- రెండు శాఖల మధ్య సమన్వయలోపంతో ట్రాఫిక్ కష్టాలు
- వానొస్తే..వాహనదారులకు చుక్కలే
- స్కూళ్లు మొదలైతే..మరింత రద్దీ
- వాటర్ లాగింగ్ పాయింట్స్‌పై దృష్టి పెట్టకపోతే.. ఇబ్బందులే

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో పది నిమిషాల పాటు వర్షం కురిస్తే చాలు..రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. ఎక్కడికక్కడే ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతున్నది. మే నెలలో కురిసిన ఆకస్మిక వర్షాలతోనైనా మేల్కొని జూన్ నాటికి జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు అప్రమత్తంగా ఉండాల్సింది పోయి, ఇంకా నిద్రావస్థలోనే ఉన్నారు. దీంతో చినుకుపడితే హైదరాబాద్, సైబరాబాద్ జంక్షన్లు జామ్ అవుతున్నాయి. వచ్చే వారం నుంచి పాఠశాలలు, కాలేజీలు ప్రారంభమవుతున్నాయి. అధికార యంత్రాంగం ఇలాగే నిద్రమత్తులో ఉంటే నగర వాసులకు మరిన్ని ట్రాఫిక్ కష్టాలు తప్పేటట్లు లేవు. గతంలో ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించుకువారు. అయితే నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. రెండు రోజుల నుంచి నగరంలో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం అరగంట పాటు కురిసిన వర్షానికి సైబరాబాద్‌లోని ప్రధాన రహదారిపై కూడళ్లు జామ్ అయి రాత్రి వరకు ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. అలాగే గురువారం మధ్యాహ్నం అరగంటకుపై వర్షం కురిసింది. దీంతో నగరంలోని బేగంపేట, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు సైబరాబాద్‌లో మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, హైటెక్ సిటీ, ఐకియా ప్రాంతాల్లో ఎక్కడికక్కడే వాహనాలు స్తంభించి.. కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. మధ్యాహ్నం నుంచే ట్రాఫిక్ రద్దీ ఉండటం, సాయంత్రం కార్యాలయాల నుంచి ఉద్యోగులు ఇండ్లకు చేరుకునే సమయం కావడంతో మరిన్ని వాహనాలు అప్పటికే ఆగి ఉన్న ట్రాఫిక్‌కు జతకలవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.



#### అప్రమత్తత లేకపోవడంతో..

ఇటీవల జరిగిన ఉదంతాలతో బల్దియా అధికారులు మేల్కోవాల్సిన అవసరమున్నది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 150కిపైగా ప్రధాన వాటర్ లాగింగ్ పాయింట్లు ఉన్నాయి. అందులో ప్రధాన కూడళ్లకు దగ్గర, ప్రధాన రహదారులపై సమస్యలను సృష్టించేవి కొన్నే ఉంటాయి. ఒక మోస్తరు వర్షం కురిసిందంటే.. అక్కడ వర్షపు నీరు చేరుతుంది. దీంతో అటు నుంచి వెళ్లే వాహనదారులు నెమ్మది కావడం వల్ల వెనుక వచ్చే వాహనాలపై ఆ ప్రభావం పడి ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్నది. అయితే వర్షం పడే అవకాశం ఉన్నప్పుడు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద పరిస్థితిని ఎప్పకటిప్పుడు గమనిస్తూ ఉండాలి. కానీ ఆ అప్రమత్తత ఇప్పుడు కనిపించడం లేదు.

#### స్కూళ్లు మొదలైతే..

పాఠశాలలకు వేసవి సెలవులు ముగింపునకు చేరుకున్నాయి. వచ్చే వారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లపై ట్రాఫిక్ రద్దీ పెరుగుతుంది. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన ట్రాఫిక్‌తో మరింత రద్దీ ఏర్పడుతుంది. స్కూల్ బస్సులు ప్రారంభం, ముగింపునకు అటూ ఇటూ వర్షం కురిసిందంటే.. మరింత రద్దీ ఏర్పడుతుంది. సాయంత్రం వేళ డ్యూటీలు ముగించుకొని.. ఇంటికి వెళ్లే వారు ఉంటారు కాబట్టి.. రద్దీ మరింత రెట్టింపవుతుంది. దీంతో రోడ్లపై ఎక్కడి ట్రాఫిక్ అక్కడ జామ్ అయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంటుంది. ట్రై పోలీస్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ ట్రాఫిక్ విషయంలో మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సామాన్యులు కోరుతున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ సిబ్బందిని సమన్వయ పరుస్తూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.

## 'కేబీఆర్'కు మరిన్ని హంగులు

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ ) : కేబీఆర్ పార్కుకు మరిన్ని హంగులను సమకూర్చేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (యూబీడీ) డాక్టర్ సునంద తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ బాలయ్య, ఇంజినీర్ మణిపాల్‌తో కలిసి గురువారం జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అదనపు కమిషనర్ డాక్టర్ సునంద కేబీఆర్ పార్కులో పర్యటించారు. కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆదేశాల మేరకు కేబీఆర్ పార్కులో కొనసాగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. పార్కు నిరంతరం పచ్చని వాతావరణంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత, చెట్ల ట్రిమ్మింగ్, గ్రీన్ వేస్ట్ లిఫ్టింగ్ పనులపై దృష్టి సారించాలన్నారు. బిందు సేద్యం (డ్రిప్ సిస్టం) ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించాలని, బేబీ పాండ్‌ను క్రమపద్ధతిలో శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన పురోగతి పనులపై ప్రత్యేకంగా చర్చించారు. పార్కు చుట్టూ కెర్బ్ వాల్ పెయింటింగ్, చెట్ల చుట్టూ ఉన్న అన్ని స్టోన్ సీటింగ్‌లను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, క్యాన్సర్ ఆసుపత్రి వ్యర్థాలు పార్కులోకి రాకుండా నియంత్రణ, పార్కులో వరద నీటి నివారణ, డ్రైనేజీ మళ్లింపు, పాడైన గ్రిల్స్‌కు ప్రత్యామ్నాయం, మరమ్మతులు, గ్రానైట్ ఫ్లోరింగ్ పనులను యూబీడీ విభాగం అధికారుల సమన్వయంతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అదనపు కమిషనర్ సునంద ఆదేశించారు.



## వరద నీటి నివారణపై ప్రత్యేక దృష్టి

### కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ వరద నీటి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి జోన్ మాదాపూర్ సర్కిల్‌లో జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి కమిషనర్ మాదాపూర్ బాటా షోరూం, యశోద దవాఖాన, శిల్పారామం తదితర ప్రాంతాల్లో వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లను పరిశీలించారు. వరద నీరు నిలువకుండా శాశ్వత చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. త్రిశూల్ గ్రాండ్ వద్ద సైడ్ రోడ్డు ప్రతిపాదనకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, బాటా షోరూం వద్ద సైడ్ వెంట్స్ క్లియర్, డిసిల్టింగ్ చేయాలని, విక్రమ్ దవాఖాన రోడ్డులో కొత్త బాక్స్ డ్రైన్‌ను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, డిప్యూటీ కమిషనర్ పాల్గొన్నారు.

#### వేగవంతంగా ఆన్‌లైన్ దరఖాస్తులను పరిష్కరించాలి

జీహెచ్ఎంసీలో ఆన్‌లైన్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. 'మై జీహెచ్ఎంసీ యాప్, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్, డయల్ 100, కాల్ సెంటర్‌కు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గురువారం జీహెచ్ఎంసీలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో వివిధ సమస్యలపై ఆన్‌లైన్‌లో వచ్చిన పెండింగ్ ఫిర్యాదులపై సమీక్షించారు. శాఖల వారీగా వచ్చిన గ్రీవెన్స్‌లను ప్రతి రోజు హెచ్‌వోడీలు పరిశీలించాలని, ఫిర్యాదు రాగానే సంబంధిత ఫిర్యాదుదారుడికి కాల్ చేసి తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల హెచ్‌వోడీలు శ్రీ వాత్సవ, స్నేహ శబరీష్, ఈఎన్‌సీ జియా ఉద్దీన్, సీఈ దేవానంద్, అడిషనల్ కమిషనర్లు రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, యాదగిరి రావు, సత్యనారాయణ, నళిని పద్మావతి, మంగతాయారు, సునంద తదితరులు పాల్గొన్నారు.


ఇంకుడు గుంతల నిర్మాణాలపై సమీక్షిస్తున్న రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్

## ఇంకుడు గుంతల నిర్మాణాలపై జలమండలి సర్వే

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : వాటర్ ట్యాంకర్ల డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి జలమండలి సర్వే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతల సర్వేపై ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఈ వేసవిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో దాదాపుగా 30వేలకు పైగా కుటుంబాలు అధికంగా వాటర్ ట్యాంకర్లు బుక్ చేసుకున్నాయి. ఆ ప్రాంతాల్లో మళ్లీ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు మొత్తం 18 స్వచ్ఛంద సంస్థల ద్వారా జలమండలి ఇంకుడు గుంతల సర్వే చేపట్టింది. ఈ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంకుడు గుంతల నిర్మాణానికి సంబంధించి.. ఇప్పటికే 4736 కుటుంబాలపై సర్వే చేశారని రెవెన్యూ డైరెక్టర్ తెలిపారు. వీరంతా ఆయా కుటుంబాలకు ఇంకుడు గుంతల నిర్మాణం ఆవశ్యకత, అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ఫలితంగా 2884 కుటుంబాలు ఇంకుడు గుంతలు నిర్మించుకున్నాయని వెల్లడించారు. 296 కుటుంబాలు వినియోగంలో లేని వాటికి మరమ్మతులు చేసుకున్నట్లు వివరించారు. మిగిలిన 1852 కుటుంబాలు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాల్సి ఉన్నదన్నారు. ఆయా కుటుంబాలకు ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షలో సింగిల్ విండో సెల్ జీఎం దామోదర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'మీపై ముంబైలో కేసు నమోదైంది'

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : ఓయూలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్డు అయిన 80 ఏండ్ల వృద్ధుడికి టెలిఫోన్ డిపార్టుమెంట్ నుంచి మాట్లాడుతున్నామంటూ కాల్ వచ్చింది.. 'మీ పేరుతో రెండు మొబైల్ నంబర్లున్నాయి.. రెండో మొబైల్ నంబర్ అంధేరీలోని వెస్ట్ ముంబై అడ్రస్‌లో ఉందం'టూ మాట్లాడారు. తనకు ఒకటే ఫోన్ నంబర్ ఉన్నదని, రెండో నంబర్ ఎవరిదో తనకు తెలియదంటూ బాధితుడు ఎంత చెప్పినా.. ఫోన్‌లో మాట్లాడేవాళ్లు వినలేదు. 'మీ పేరుపై మహారాష్ట్రలో కేసు నమోదైంది. ఫలాన నంబర్‌లో మాట్లాడుకోండి..వాళ్లు అరెస్ట్‌కు సంబంధించిన వ్యవహారాన్ని చూసుకుంటారం'టూ ఆ నంబర్ చెప్పి ఫోన్ పెట్టాశారు. ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే.. 'మేం సైబర్ క్రైమ్ డిపార్టుమెంట్ వాళ్లం. రాజ్ కుంద్ర మనీ లాండరింగ్ కేసులో మీకు కనెక్షన్లు ఉన్నట్లు అనుమానాలున్నాయి. ముంబైకి మీరు రావాల్సి వస్తుంది. ఈ కేసు సీబీఐ చూస్తుంద'ంటూ బెదిరింపులకు దిగారు. చివరికి బాధితుడి రెండు బ్యాంకు ఖాతాలోని రూ. 15.86 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను రద్దు చేయించి.. ఆ డబ్బును తమ ఖాతాలో డిపాజిట్ చేయించారు. డబ్బు డిపాజిట్ చేసిన తరువాత వీడియో కాల్ కట్ చేసిన సైబర్‌నేరగాళ్లు.. మళ్లీ రేపు ఉదయం కాల్ చేస్తామం'టూ నమ్మించి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. బాధితుడు ఈ మోసాన్ని గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.



### ఫిష్.. ఫుల్ రష్

మృగశిర కార్తె రోజు..తప్పకుండా చేపలు తినాలనేది ఆనవాయితీగా వస్తున్నది. మృగశిర సమీపించిన నేపథ్యంలో గురువారం ముషీరాబాద్ చేపల మార్కెట్ కొనుగోలుదారులతో ఇలా కిటకిటలాడింది.

## రెండ్రోజులు వర్షసూచన

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాల ప్రభావంతో గురువారం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిశాయి. రాత్రి 9 గంటల వరకు ఖైరతాబాద్ సెస్ ప్రాంతంలో అత్యధికంగా 3.7 సెం.మీలు, కృష్ణానగర్‌లో 3.5, సికింద్రాబాద్ పాటిగడ్డలో 3.1, షేక్‌పేట, బన్సీలాల్‌పేటలో 3.0, ఫిల్మ్‌నగర్‌లో 2.4, గచ్చిబౌలి, బంజారాహిల్స్‌లో 2.2, హయత్‌నగర్, చందానగర్‌లో 1.9 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ వెల్లడించింది. రుతుపవనాల ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## చేప ప్రసాదం..130 ప్రత్యేక బస్సులు

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో శని, ఆదివారం చేప ప్రసాదం పంపిణీ ఉన్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి 130 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి 9, కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి 7, జేబీఎస్ నుంచి 9, ఎంజీబీఎస్ నుంచి 9, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ నుంచి 9, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి 7, దిల్‌సుక్‌నగర్ నుంచి 7, ఎన్జీవోస్‌కాలనీ నుంచి 7, మిథాని నుంచి 7, ఉప్పల్ నుంచి 7, చార్మినార్, గోల్కొండ, రాంనగర్ నుంచి 15, రాజేంద్రనగర్ నుంచి 7, రిసాల బజార్ నుంచి 5, ఈసీఐఎల్ నుంచి 5, పటాన్‌చెరు నుంచి 5, జీడిమెట్ల నుంచి 5, కేపీహెచ్‌బీ కాలనీ నుంచి 5, గచ్చిబౌలి నుంచి 5 ప్రత్యేక బస్సు సర్వీసులను నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వరకు నడిపిస్తున్నట్లు ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు.